తెలుగు కథాసమితి (న్యూజెర్సీ) చిన్న కథల పోటీలో రు. 200 గెలుచుకున్న రచన

# మనీ - మనిషి - మనసు

-ఎల్. ఉమాజీ

"అమ్మా! బొగ్గులారీ వచ్చింది."

అన్న పని మనిషి కేకతో బయటకు వచ్చాను. ఆ కేక విన్న పిన్ని వంటింట్లోంచి తడిచేయి కొంగుకు తుడుచుకొంటూ ఇవతలకొచ్చింది. ఆమె మొహం వెయ్యి వోల్టుల బల్బులా వెలిగిపోతోంది. "ఎక్కడే లారీ" అంటూ పని మనిషి నడిగింది పిన్ని.

"అదుగోనమ్మా, ఇంజనీరమ్మ ఇంటిముందుంది" అని సమాధాన మిచ్చింది. దాని ఉద్దేశ్యంలో ఇంజనీరు భార్య ఇంజనీరమ్మ, డాక్టరు భార్య డాక్టరమ్మ, మేనేజరు భార్య మేనేజరమ్మ-అలా-

నేను కుతూహలం ఆపుకోలేక గేటు వద్దకు వెళ్ళి గమనిస్తున్నాను. లారీలో బొగ్గెక్కడా కనబడలేదు. లారీ డ్రైవర్, మరొకతను దిగి ఆ ఇంటి యజమాను రాలితో ఏదో మాట్లాడుతున్నారు. నలుగురు కూలివాళ్ళు ఖాళీ తట్టలతో, నెత్తి మీద గుడ్డ చుట్టలతో నిలుచొని వున్నారు.

ఆ సమయంలో ఇళ్ళలో మొగవాళ్ళెవరూ వుండరు. విధినిర్వహణకై వారి వారి ఆఫీసుల కెళ్ళి వుంటారు.

అదొక రాక్షసి బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీ వున్న కాలరీ ఏరియా. మా బాబాయ్ ఆ కంపెనీలోనే అండర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. నేను మా కాలేజీకి సెలవలిస్తే చుట్టపు చూపుగా పిన్ని దగ్గరకు వచ్చాను. ఈ వ్యవహారం చాలా వింతగా వుంది నాకు.

ఆ లారీ ఆగిన ఇల్లు మా ఇంటి ఎదురు లైనులో వుండడం చేత స్పష్టంగా కనబడుతోంది. డ్రైవర్‌తో వున్నతను ఆ ఇంటావిడతో ఏదో మాట్లాడి జేబులో నుండి డబ్బు కట్ట బయటకు తీసి కొంత డబ్బు ఆమె చేతిలో పెట్టాడు. ఇంక తట్టలు పట్టుకొని నుంచున్నవాళ్ళలో చలనం మొదలైంది. వారు లోనికి వెళ్ళి బొగ్గు నింపిన తట్టలను తెచ్చి లారీలో గుమ్మరిస్తున్నారు. ఆ ఇంటి నుండి ముందుకు కదిలింది లారీ. మరొక ఇంట్లోనూ ఇదే తంతు. అలా లారీ గర్భిణీ స్త్రీలా బొగ్గు నింపుకొని భారంగా మా ఇంటిదాకా వచ్చింది. డ్రైవర్ ప్రక్కనున్నతను మా పిన్నిని చూసి పలకరింపుగా నవ్వి నమస్కరించాడు. "ఈ నెల లేటుగా వచ్చారేం?" ప్రశ్నిస్తోంది పిన్ని. అతనేదో చెప్తున్నాడు. జేబులో నుండి డబ్బు కట్టను తీసి ఓ



నాలుగొందలు పిన్ని చేతిలో పెట్టాడు. పిన్ని లెక్క చూసుకుంటూ "అందరికీ ఒకే రేటా?" అంది.

"హన్నన్నా! అంత అవమానం కలగ జేస్తనా అమ్మగోరూ! పెద్ద దొరోళ్ళకి పెద్ద మొత్తాలు, చిన్న దొరోళ్ళకి చిన్న మొత్తాలు-ఆళ్ళాళ్ళ కాటగిరీని బట్టే ముట్ట జెప్పనా!" అంటూ చెప్పుకుపోతు న్నాడు. "సరే, కానీ - " అంటూ పిన్ని లోపలకొచ్చింది. పిన్నితో పాటు నేనూ-

"ఏంటి పిన్నీ! ఈ లారీ-బొగ్గు వ్యవహారం నాకేం అంతు బట్టకుండా వుంది సుమా!" అన్నాను క్వశ్చన్ మార్కు మొహంతో.

"ఇందులో అంతుబట్టని దేముందే పిచ్చి మొహమా? మనం బొగ్గుగనిలో ఉద్యోగం చేస్తున్నాం కాబట్టే వాళ్ళు వాడు కోవడానికి నెల నెలా కొంత బొగ్గు నిస్తున్నారు. ఇతరత్రా వనరులున్నాయి కాబట్టే, మనం ఆ బొగ్గును ఇష్టమొచ్చిన రేటుకు అమ్ముకొంటున్నాము. ఇందులో తప్పేం వుంది?" అంది పిన్ని. ఆవిడ వితండవాదం ఎదుర్కొని నిలబడలేనని తెలుసు- అందుకే కిమ్మనకుండా ఊరు కున్నాను.

కానీ, ఆలోచనలు నన్నొదల్లేదు. నేను వచ్చిన దగ్గర నుండి గమనిస్తు న్నాను. మీటరు లేని ఫ్రీ కరెంటును వాళ్ళు వాడుకొనే తీరు చూస్తే "ఇంత విచ్చలవిడితనమా?" అనిపిస్తుంది. ఆన్ చేసిన లైట్లు గానీ, ఫ్యాన్లుగానీ ఆపే ప్రయత్నమే చేయరు. ఎవరూ లేని గదుల్లో ఫ్యాన్లు తిరుగుతూంటే, పట్ట పగలు గదుల్లో లైట్లు వెలుగుతూంటే - అలవాటైన చేయి స్విచ్ ఆఫ్ చేస్తుంటే పిన్ని నవ్వే నవ్వు నా మనసును కలుక్కు మనిపిస్తుంది. కరెంట్ హీటర్ మీద వంట పూర్తిచేస్తుంది పిన్ని. అలంకార ప్రాయంగా గ్యాస్ సిలెండరు స్టవ్ ఒక ప్రక్కకు ఒదిగి వుంటాయి. ఓవర్ హెడ్ టాంక్‌లో వాటరు ప్రతి రోజు ఓవర్ ఫ్లో అవుతూనే వుంటుంది. వాటర్ మాన్ వాల్వు కట్టేదాకా నీళ్ళు పొంగి పోతూనే వుండాలి-

ఇతరత్రా వున్న గవర్నమెంట్ కరెంట్ కోత విధానం వల్ల ప్రజల, పరిశ్రమల ఇక్కట్లు తలుచుకొంటుంటే, అతివృష్టి అనావృష్టి అంటే ఇదేనేమో అనిపిస్తుంది.

భోజనాల వద్ద తాను సాధించిన నాలుగొందల గూర్చి గొప్పగా చెప్తోంది పిన్ని, బాబాయ్‌తో. ప్రక్కవాళ్ళకంటే ఏభై రూపాయిలు అదనంగా ఏ విధంగా సంపాదించిందో, తన భర్త స్టేటస్ ఏ విధంగా నిలబెట్టిందో వర్ణిస్తోంది. భర్తకు నాలుగు వేల సంపాదనున్నా తాను పొందిన అక్రమ సంపాదనను చూసి మురుస్తోంది. అందుకేనేమో 'అసలు కంటే వడ్డీ ముద్దు' అంటారు.

ఆమె వాగ్ధాటిని ఆపే ప్రయత్నంలో "ఈ వ్యవహారం పేపరు కెక్కింది చూసావా? అందుకే బొగ్గు ఇవ్వటం నిలుపుజేసి, వంటొండుకోడానికి నెలకొక ఫ్రీ సిలెండర్ మొహాన కొట్టే ఆలోచ నలో వుంది యాజమాన్యం. ఇకనైనా ఈ బొగ్గు గోల ఆపు-" అన్నాడు బాబాయ్.

చిన్నబుచ్చుకొన్న పిన్ని, నాలు గొందల నుండి అరనై ఆరు రూపాయిల వరకు ఒకేసారి పడిపోయి నెల నెలా సిలెండరును ఏ రేటుకు అమ్మాలా! అన్న ఆలోచనలతో మునిగిపోయింది- "బండ మీద రూపాయి పుట్టించడం అంటే ఇదే గాబోలు" అనుకున్నాను నేను.